అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
సోమవారం 09 జనవరి 2023

బాలుడి చికిత్సకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన కావేటి శివ, శిరీష దంపతుల బాబు గుండె చికిత్సకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వ్యక్తిగత సహాయకులు కృష్ణంరాజు రూ.5000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. అంతేకాకుండా హైదరాబాద్‌లోని రెయిన్‌బో హాస్పిటల్‌కు వెళ్లి బాబు చికిత్స కోసం డాక్టర్లతో మాట్లాడారు. బిల్లు మొత్తంలో ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి డిస్కౌంట్ చేయించారు.

11న దివ్యాంగులకు పరికరాల పంపిణీ

నవతెలంగాణ - కాగజ్‌నగర్

ఢిల్లీకి చెందిన అలింకో కంపెనీ ఆధ్వర్యంలో ఈ నెల 11న కాగజ్‌నగర్ పీహెచ్‌సీ వద్ద దివ్యాంగులకు అవసరమైన పరికరాలను పంపిణీ చేయనున్నట్టు కంపెనీ ప్రతినిధి రంజిత్ కుమార్, చైతన్య దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ ఖయ్యూం తెలిపారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బ్యాటరీ సైకిళ్లు, వినికిడి యంత్రాలు, చేతికర్రలు, కృత్రిమ కాళ్లు తదితర వాటిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పరికరాలు అవసరం ఉన్నవారు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. అన్ని మండలాలకు చెందిన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-తలమడుగు

1997-98 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఖోడద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సమ్మేళనంలో ఆనాటి కాలంలో విద్యాబుద్ధులు నేర్పినటువంటి గురువులతో కలిసి గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాయామశాల సమస్యలపై వినతిపత్రం



నవతెలంగాణ - రెబ్బెన

సింగరేణి ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాయామశాల సమస్యల గురించి బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్‌ను శనివారం సింగరేణి కార్మికులు, గోలేటిలోని యువత వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాయామశాలలో పూర్తిస్థాయి మెటీరియల్ సమకూర్చాలని, సింగరేణి ఉద్యోగులే కాకుండా గోలేటిలోని యువతకు వ్యాయామం చేసుకొనే వెసులుబాటును కల్పించాలని, వ్యాయామశాలను సకాలంలో తెరవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

భారత రాజకీయాల్లో యువత పాత్ర ఉండాలి

నవతెలంగాణ-బోథ్

భారత రాజకీయాల్లో యువత పాత్ర ఉండాలని వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రగతి విద్యానికేతన్‌లో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన, ఫొటో ఐడెంటిఫికేషన్ పోటీలను నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 12న బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రోహిత్, సాయికృష్ణ, అనిల్, కార్తీక్, కుశాల్, రవితేజ పాల్గొన్నారు.

గువ్వలగూడలో ఘనంగా భీమదేవర జెండా పండగ

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని గువ్వలగూడలో ఆదివాసీ కొలవార్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్స వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ఆదివాసీ కొలవార్ భీమదేవర జెండా పండగ నిర్వహించారు. జెండా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈస్‌గాం ఎస్సై కొయ్యడ జగదీష్, జిల్లా కొలవార్ సేవా సంఘం ఉపాధ్యక్షుడు బుర్స రంగయ్య, మండల అధ్యక్షుడు ఎరగటి విలాస్ హాజరయ్యారు. జెండాను ఆవిష్కరించి భీమదేవరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చాపిడి పవిత్ర ధనరాజ్, ఎంపీటీసీ చునార్కర్ జమున మహేష్, పీఏసీఎస్ డైరెక్టర్ దర్ని రామన్న, మండల ఉపాధ్యక్షుడు చింతపురి పోచం, పుల్లయ్య, గువ్వల భీమయ్య, బండి భీమయ్య, గువ్వల నరేందర్, కట్టెకొల పోచమల్లు, అల్లకొండ కిరణ్, ఎరగటి శ్రీశైలం, సంద్ర రామకృష్ణ, కట్టెకొల కోటేష్ పాల్గొన్నారు.

నస్పూర్‌లో టీబీజీకేఎస్ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా సీసీసీ వెంకటేశ్వర స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు వెంకట్రావుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీసాయి అందుల, వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమము నిర్వహించారు. శ్రీరాంపూర్ ఉపరితల గనిలో మంద మల్లారెడ్డి అధ్యక్షతన వెంకట్రావు జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు ఆక్కూరి సుబ్బయ్య, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు అన్నయ్య, మంద మల్లారెడ్డి, కార్పొరేట్ చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

పేదోడిపై కరెంట్ కత్తి..!

- ఏసీడీ ఛార్జీల పేరిట అదనపు వడ్డన
- ఇప్పటికే ఛార్జీల పెంపుతో ఆర్థిక భారం
- విద్యుత్తు బిల్లులు చెల్లించలేక పేదలు సతమతం

ఆదిలాబాద్ పట్టణంలోని ఓ వ్యక్తి డిసెంబర్ నెలలో 107 యూనిట్ల కరెంట్‌ను వినియోగించారు. ఈయనకు వినియోగించిన విద్యుత్తు ఛార్జీ రూ.488 వచ్చింది. కాని అదనంగా ఏసీడీ ఛార్జీ పేరిట రూ.848 వేసి బిల్లు అందజేశారు. ఇలాంటి వినియోగదారులు అనేక మంది ఈ అదనపు ఛార్జీలు చూసి ఖంగుతింటున్నారు.

పేదోళ్లపై మరోసారి కరెండు పిడుగు పడుతోంది. కిందటేడాది కస్టమర్ డెవలప్‌మెంట్ ఛార్జీల పేరిట అదనపు భారం మోపగా.. తాజాగా అడిషనల్ కన్జమ్షన్ డిపాజిట్(ఏసీడీ) పేరిట మరోసారి అదనపు వడ్డనకు శ్రీకారం చుట్టింది. ఈ డిపాజిట్ పేరుతో నెలవారీ బిల్లులతో పాటు ఏసీడీ పేరిట అదనంగా బిల్లులు వేసి అందజేస్తున్నారు. దీంతో గతం కంటే అదనపు బిల్లులు రావడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. చెల్లించాల్సిన ఛార్జీల కంటే అదనంగా రూ.వేలల్లో బిల్లులు రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. అదనపు బిల్లులు చూసి వినియోగదారులు విద్యుత్‌శాఖ కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. ఇది వరకే కరెంటు ఛార్జీలు పెంచడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలపై ఇలా వివిధ రూపాల్లో అదనపు ఛార్జీలు మోపడం సరైంది కాదని జనం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం నిత్యావసర సరుకుల ధరలు పెంచితే.. రాష్ట్రం విద్యుత్తు ఛార్జీల పేరిట అదనపు భారం మోపడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల పెంచడంతో పోటీ పడుతున్నారు. కేంద్రం నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ పోతే.. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పేరిట అదనపు భారానికి సిద్ధమవుతోంది. ఈ రెండు ప్రభుత్వాల నిర్ణయాల కారణంగా కూలీనాలి చేసుకొని జీవించే పేదలు నలిగిపోతున్నారు. ప్రజా సంక్షేమాల పేరిట పేదలకు లబ్ధి చేకూర్చాల్సిన ప్రభుత్వాలు ధరలు పెంచుతూ వారి నడ్డి విరిచే పనులు చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. కిందటేడాది కస్టమర్ డెవలప్‌మెంట్ ఛార్జీల పేరిట రూ.వేలల్లో అదనపు భారం మోపడంతో వినియోగదారులు వాటిని చెల్లించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కరెంటు కట్ చేస్తారనే భయంతో గత్యంతరం లేక అప్పులు చేసి విద్యుత్ బిల్లు చెల్లించాల్సి వచ్చింది. మరోపక్క కిందటేడాది రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీల కారణంగా ప్రతి నెలా అదనపు భారం పడుతోంది. కరోనా కారణంగా ఉపాధి, ఉద్యోగాలు కోల్పోయి ఇతరాత్ర చిన్నచితక పనులు చేసుకుంటున్న పేదలు ప్రతి నెలా అధిక మొత్తంలో విద్యుత్ ఛార్జీలు చెల్లించడం ఇబ్బందిగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏసీడీ పేరిట అదనపు భారం..!

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏసీడీ(అడిషనల్ కన్జమ్షన్ డిపాజిట్) పేరిట విద్యుత్ ఛార్జీలపై అదనంగా భారం మోపుతోంది. ఏడాది మొదట్లోనే అదనపు బిల్లు రావడంతో వినియోగదారులు



ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఈ బిల్లు ఎందుకు వచ్చిందో తెలియక ఆ శాఖ వద్దకు పరుగులు పెట్టారు. ఇది వరకు 300యూనిట్లు దాటితే కస్టమర్ డెవలప్‌మెంట్ ఛార్జీల పేరిట అదనపు బిల్లులు వేసేవారు. ఈ ఏడాది దాని స్థానంలో ఏసీడీని తీసుకొచ్చారు. ప్రస్తుతం 300యూనిట్ల పరిమితిని ఎత్తివేసినట్లు తెలుస్తోంది. ఏసీడీ విధానంలో 250వాట్ల కంటే తక్కువ లోడ్ ఉన్న వారికి రూ.80 చెల్లించాలని, రెండు నెలలకు ఒకసారి బిల్లులు జారీ చేసే వినియోగదారులు రూ.100 చెల్లించాలని స్పష్టం చేసింది. 250వాట్ల కంటే ఎక్కువ ఒప్పంద లోడ్ ఉంటే రూ.200, రెండు నెలలకు ఒకసారి బిల్లులు జారీ చేయబడే వారు రూ.300చొప్పున చెల్లించాల్సిన ఉంటుందని విద్యుత్‌శాఖ స్పష్టం చేసింది. కానీ అనేక మంది పేదలకు అదనపు బిల్లులు రావడంతో లబోదిబోమంటున్నారు. వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న ఈ ఛార్జీలు అడిషనల్ మాత్రమేనని..సర్వీసు తొలగించుకున్న తర్వాత చెల్లించిన డబ్బులు తిరిగి అందజేసేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఈ విధానం ముందు నుంచి ఉన్నదే : కె.సంపత్‌కుమార్, విద్యుత్‌శాఖ ఎస్ఈ



ఈ విధానం ఈ ఏడాది వచ్చింది కాదు. ముందు నుంచి ఉన్నదే. వినియోగదారులు తీసుకున్న సర్వీసు లోడు కంటే అధిక విద్యుత్ వినియోగిస్తే ఈ ఛార్జీలు పడుతాయి. ఇది అడిషనల్ డిపాజిట్ మాత్రమే. వినియోగదారులకు మళ్లీ తిరిగి చెల్లించేందుకు అవకాశం ఉంటుంది.

పేదలపై భారం మోపడం సరికాదు : దర్శనాల మల్లేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి



ప్రభుత్వం పేదలపై అదనపు విద్యుత్ ఛార్జీలు మోపడం సరికాదు. ఇప్పటికే విద్యుత్ ఛార్జీలు పెంచడంతో పేదలపై ఆర్థిక భారం పడింది. తాజాగా ఏసీడీ పేరిట అదనపు రుసుం వసూలు చేయడంతో మరింత ఇబ్బందులు పడుతాయి. ప్రభుత్వం వెంటనే ఈ ఛార్జీల వడ్డనను ఉపసంహరించుకోవాలి.

సుప్రీం కోర్టు జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్



నవతెలంగాణ - దహెగాం

సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జాడి మొరేశ్వర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కారోబార్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అలాగే ఈఎస్ఐ, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కారోబార్‌లకు వారి సీనియార్టీ ప్రకారం ప్రమోషన్‌లు ఇవ్వాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.51ని సవరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కాకుండా నేరుగా కార్మికుల ఖాతాల్లోకే వేతనాలను వేయాలని, గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కారోబార్‌ల మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా గడ్డం ప్రభాకర్‌గౌడ్, అధ్యక్షులుగా కంద రమేష్, ప్రధాన కార్యదర్శిగా దిగిడి రవీందర్, ఉపాధ్యక్షులుగా జాడి మల్లయ్య, గుండేటి సాయికృష్ణ, ప్రచార కార్యదర్శిగా ఒడిల రాజన్న, సహాయ కార్యదర్శిగా అరుణ్, ఉదయ్, మారుతి, ప్రభాకర్, కోశాధికారిగా తామెర రాజ్‌కుమార్‌తో పాటు మరో 9మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కారోబార్‌లు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

విద్యార్థి దశ నుండే సమాజంలో ఉన్న ప్రతి అంశాన్ని తెలుసుకోవడానికి ఆసక్తి పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి టి. రవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో న్యాయవిజ్ఞన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలపై తెలుసుకోవడానికి ఆసక్తి చూపాలన్నారు. ముఖ్యంగా బాలికలు, మహిళలకు హక్కులను ప్రత్యేకంగా తెలుసుకోవాలని తెలిపారు. సమాజంలో ఇంకా బాల్యవివాహాలు కొనసాగుతున్నాయని, మహిళలపై ప్రతిరోజు అరాచకాలు జరుగుతున్నాయని తెలిపారు. వీటన్నంటినీ రూపుమాపాలంటే విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కొన్నేండ్ల నుండి మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాలు పోక్సో చట్టాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందేనన్నారు. పాఠశాలకు వెళ్లని విద్యార్థులను పాఠశాలలకు వెళ్లే విధంగా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాలల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ దీకొండ రమేష్, న్యాయవాదులు అజయ్‌కుమార్, సామాజిక కార్యకర్త డోంగ్రి పవన్‌కుమార్, ఎస్ఓ నాగసుధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత సేవలు

- అంతర్జాతీయ వాసవి క్లబ్ కార్యదర్శి ఇరుకుల్ల రామకృష్ణ
- వైభవంగా జిల్లా క్యాబినెట్ ప్రమాణ స్వీకారోత్సవం

నవతెలంగాణ - హాజీపూర్

అంతర్జాతీయ స్థాయిలో అనేక రకాల సేవా కార్యక్రమాలను అందిస్తూ అత్యున్నత సేవలకు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతిరూపంగా నిలుస్తున్నాయని అంతర్జాతీయ వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి ఇరుకుల్ల రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వేంపల్లి ఎస్వీఎస్ కన్వెన్షన్‌లో జిల్లా క్యాబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ కొండా చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడారు. క్లబ్ సభ్యుల సహకారంతో నిరుపేద విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పించడానికి సరస్వతి పథకాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు ప్రతి సంవత్సరం లక్షల రూపాయల విలువ చేసే పుస్తకాలను కెసిజిఎఫ్ పథకంలో భాగంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే వాసవి కుటుంబ సురక్ష పథకం ద్వారా మరణించిన క్లబ్ సభ్యుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. చేయూత పథకం ద్వారా నిరుపేదలకు వ్యాపార పరంగా ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తూ వారి ఉన్నతికి ముఖ్య



భూమిక పోషిస్తున్నట్లు గుర్తు చేశారు. అనేక సేవా కార్యక్రమాలను నిరుపేదల కోసం చేపడుతూ ప్రపంచవ్యాప్తంగా వాసవి క్లబ్ సేవలను అందజేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అప్పిల శ్రీధర్, కోశాధికారి అక్కెనపల్లి నాగరాజు, అంతర్జాతీయ వాసవి క్లబ్ అధికారులు ముక్త శ్రీనివాస్, రేణికుంట్ల శ్రీనివాస్, కటకం హరీష్, సిరిపురం సత్యనారాయణ, ఆవునూరి శివలీల, పవిత్రం శ్రీనివాస్, ఎక్కిరాల శ్రీనివాస్, కలికోట శ్రీనివాస్, బాల సంతోష్, జిల్లా అధికారులు ఆదిత్య, మంచిర్యాల వాసవి క్లబ్ , వనితా క్లబ్, యూత్ క్లబ్, కపుల్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారిలు జిల్లాలోని రీజియన్ చైర్మన్లు, జోన్ చైర్మన్‌తోపాటు మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి , పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల వాసవి క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో కారు యాక్సిడెంట్

- భైంసాకు చెందిన యువకుడి మృతి

నవతెలంగాణ-భైంసా



మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తుల్జా భవాని మాత దర్శనానికి వెళ్తు భైంసా పట్టణానికి చెందిన ఓ యువకుడు కారు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. తెలిసిన వివరాల ప్రకారం.. ఏపీనగర్‌కు చెందిన అభిలాష్(26) నలుగురు స్నేహితులతో కలిసి శనివారం రాత్రి తుల్జా భవాని దర్శనానికి వెళ్లారు. ఆదివారం తెల్లవారు జామున తుల్జాపూర్‌కు కొద్ది దూరంలో కారుకు కుక్క అడ్డురావడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న అభిలాష్ అక్కడికక్కడే ప్రాణలు కోల్పోయాడు. అందులో ప్రయాణిస్తున్న మరో నలుగురు రాజు, సాయినాథ్, డి. రాజు, విశాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అభిలాష్ మరణ వార్త విన్న కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గొల్లవాగు పరివాహకంలో పక్షి జాతుల అన్వేషణ

భీమారం : మండల అటవీ పరివాక ప్రాంతాల్లోని జలాశయాలలో విభిన్న పక్షి జాతులపై అన్వేషణ జరుగుతోంది. దీని కోసం అటవీ శాఖ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. ఆదివారం మండల పరిధిలోని గొల్లవాగు పాజెక్ట్ పరివాహక ప్రాంతంలో ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు జిల్లా స్థాయి అధికారుల ఆధ్వర్యంలో బర్డ్‌వాక్ నిర్వహించారు. బూరుగుపల్లి సెక్షన్ పరిధిలో గల పులి ఒర్రె మీదుగా నర్సింగాపూర్ జల్లు వాగు వరకు జలాశయాల వద్ద బర్డ్‌వాక్‌లో భాగంగా పక్షుల అన్వేషణ కొనసాగిందని మంచిర్యాల డీఎఫ్ఓ శివ ఆశిష్ తెలిపారు. తమ అన్వేషణలో పలు విభిన్నమైన జాతుల పక్షులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా వాటి జీవన మనుగడకు స్థానిక స్థితిగతులను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల ఎఫ్‌డీఓ వినయ్ సాహూ, చెన్నూర్ డివిజన్ ఎఫ్‌డీఓ రమేష్, ఎఫ్ఆర్వో శివకుమార్, చెన్నూర్ డివిజన్ ఫారెస్ట్ సెక్షన్



అధికారులు, బీట్ అధాకారులు, బేస్‌క్యాంప్ వాచర్స్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-బోథ్

ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌ను ఆదివారం బోథ్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సన్మానించారు. కార్యక్రమంలో బోథ్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భూషణ్ లక్ష్మణ్, సభ్యులు విజయ్, బిక్కు లక్ష్మణ్ పాల్గొన్నారు.



అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
సోమవారం 09 జనవరి 2023

ఎన్టీఆర్‌నగర్‌లో పర్యటించిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-ఉట్నూర్



మార్నింగ్ వాక్ సమయంలో ఎన్టీఆర్ నగర్ కాలనీలో జెడ్పిటీసీ రాథోడ్ చారులత ఆదివారం పర్యటించారు. కాలనీ వాసులను పలుకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో భగీరథ నీరు రావడం లేదని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, కొందరికి ఫించన్‌లు రావడం లేదని కాలనీ వాసులు జెడ్పిటీసీ దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధించిన అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



అన్ని దానాలలో కెల్ల అన్నదానం గొప్పదని స్మైల్ సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో రోగి బంధువులు, పేదలకు సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం అన్నదానం చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు భూరె సురేష్, రాకేష్, రాధాకష్ణ, రామకష్ణ, సాయి, కిరణ్, గంభీర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి



నవతెలంగాణ- ఖానాపూర్

దళిత ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బాణావత్ గోవింద్, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు రసమొల అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల హైస్కూల్‌లో పనిచేస్తున్న దళిత సామాజిక వర్గానికి చెందిన మల్లికార్జున్‌ను పలువురు మత చందాస వాదులు మతాన్ని దౌర్జన్యంగా అంటగట్టే ప్రయత్నంలో వ్యతిరేకించినందుకు అతనిపై దౌర్జన్యం చేశారని అన్నారు. టీచర్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి చట్ట రీత్యా చర్య తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో బొమ్మెన రాకేష్, సంగర్తి రాజన్న, ఉప సర్పంచ్ సయ్యద్ షారుక్ తదితరులు పాల్గొన్నారు.

12న కలెక్టరేట్ ఎదుట రైతు ధర్నాకు తరలిరండి

● అఖిలపక్ష రైతు సంఘం పిలుపు



నవతెలంగాణ-తలమడుగు

పత్తి గిట్టుబాటు ధరకోసం ఈ నెల 12 న కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నా కార్యక్రమానికి రైతులందరు కదిలి రావాలని రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం తాంసి, సుంకిడి, జామిడి, కప్పర్ల, భీంపూర్, ధనోరా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష రైతు సంఘం నాయకులు దారట్ల కిష్టు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ - కాటన్ కార్పొరేషన్ అఫ్ ఇండియా (సిసిఐ) బహిరంగ పోటీ మార్కెట్‌లో కమర్షియల్ పద్ధతిలో పత్తిని కొనుగోలు చేయకపోవడం వల్ల ధరలు పడిపోతున్నాయని తెలిపారు. పత్తి పంటను కమర్షియల్ పద్ధతిలో సీసీఐ కొనుగోలు చేయడానికి అవకాశాలు ఉన్నప్పటికీ కొనుగోలు చేయడం లేదన్నారు. అందువల్లనే రైతు పంటలకు గిట్టుబాటు ధర దొరకడం లేదని తెలిపారు. రైతు పంటలకు తగిన గిట్టుబాటు ధరలు శాస్త్రీయ పద్ధతిలో నిర్ణయించకపోవడంతో రైతు పంటలకు సాగు పెట్టుబడి పెరిగిన పరిస్థితిలో నేటి ధరలు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదన్నారు.పత్తికి తగిన గిట్టుబాటు ధర లేకపోవడంతో భవిష్యత్‌లో పెరుగుతుందేమో అనే ఆశతో 80 శాతం రైతులు పత్తిని నిల్వ చేసుకున్నారని తెలిపారు. ఈ పరిస్థితిలో అక్కడక్కడా రైతుల పత్తి అగ్నిప్రమాదానికి గురై నష్టపోతున్నారని పేర్కొన్నారు. పత్తికి తగిన గిట్టుబాటు ధరకోసం 12న కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నా కార్యక్రమంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు లోకారి పోశెట్టి, విజ్జగిరి నారాయణ, కేమ లక్ష్మణ్, సామ సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయండి

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్

నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

పత్తి ధర పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ పత్తిరైతులకు క్వింటాల్ కు రూ 10,000 చెల్లిస్తూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం తక్షణం ఆ దిశగా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. అందుకోసమే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పత్తిరైతుల ధర్నా కార్యక్రమం నిర్వహిచడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ధర్నాలో పత్తి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అథ్లెటిక్స్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించారు. సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియను పర్య వేక్షించేందుకు అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర పరిశీలకులుగా మారయ్య హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా గుండి మహేష్ వ్యవహరించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డిసిసిబి చైర్మన్ అడ్డి బోజారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పిట్ల రాజేష్ కోశాధికారిగా విజిఎస్ రాకేష్, ఉపాధ్యక్షులుగా సట్ల అశోక్, ఎస్ స్వామి, పురుషోత్తం యాదవ్, సంయుక్త కార్యదర్శులుగా ఏ రాజ్యలక్ష్మి, బి జై సింగ్, ఎస్ మారుతి, ఎం జంగుబాయి, బి శివకుమార్, కార్యవర్గ సభ్యులుగా కే మణిందర్, కే. జంగుబాయి, కే జలపతిరావు, ఏ పండరి, డి మహేష్, జే ప్రేమ్ సాగర్ లు ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు రిటర్నింగ్ అధికారి గుండి మహేష్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి కే పార్థసారథి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆదిలాబాద్ పరిశీలకుడు ఎక్బాల్, పెటాటీస్ ఆదిలాబాద్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎన్ స్వామి, ఎస్ జి ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్ కాంతారావు, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ జి. నాందేవ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుభీర్

నియోజకవర్గంలో ఉన్న ప్రతి పేద ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు.ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో కుభీర్ మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన పాండురంగకు రూ.1లక్ష, లక్ష్మణ్‌కు రూ.11000 వివిధ కారణాల వల్ల అనారోగ్యంతో బదపడుతుండగా ఎమ్మెల్యేని కలసి వారి బాధలు తెలపడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, వ్యవసాయ సహకార సంగం చైర్మన్ గంగా చరణ్, వైస్ ఎంపీపీ మోహియోద్దీన్, కో అప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్, మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 13, 14 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలోని మన్నెగూడలో నిర్వహిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు ఎ. స్వామి, ప్రధాన కార్యదర్శి వి. అశోక్ లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడప్రతులను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈ మహాసభలకు తెలంగాణ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, ఉపాధ్యాయ ఎంఎల్ సి అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యేలు, ఎంపిలు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు హాజరవుతున్నట్లు తెలిపారు. కేరళ ప్రభుత్వ విప్, మాజీ ఆరోగ్య శాఖ మంత్రి కె కె శైలజ వక్తగా పాల్గొంటున్నారన్నారు. కావున ఈ మహాసభలకు ఉపాధ్యాయులు, విద్యారంగ శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎ.సురేఖ, కోశాధికారి కె.కిష్టన్న, కార్యదర్శులు కె శ్రీనివాస్, గౌస్ మొహియుద్దీన్, ఎ. ఇస్తారి, కె. గణేష్, జిల్లా బాధ్యులు వై.అశోక్ రెడ్డి, లక్ష్మీనారాయణ, కె రాజశేఖర్, వివిధ మండలాల బాధ్యులు ఎం.మహేందర్, ఎన్.గణేష్, ఆర్.అశోక్ పాల్గొన్నారు.

భీమన్న దేవునికి ఎమ్మెల్యే వెండి విరాళం

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని భీమన్న దేవుని ఆలయానికి ఎమ్మెల్యే రేఖానాయక్ 21 తులాల వెండి గొలుగులను అందజేశారు. గత సంవత్సరం భీమన్న దేవుని జాతర సందర్భంగా భీమన్న దేవునికి 21 వెండి తులాల గొడుగులు చేపిస్తామని మొక్కుకున్నారు. ఆదివారం దేవాలయంలో తీర్చుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలు, రైతాంగం పైన భీమన్న దేవుని ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలి

● టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియూటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో జరిగిన జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 8 సం.లుగా పదోన్నతులు, 5 సం.లుగా బదిలీలు లేక ప్రభుత్వ విద్యా వ్యవస్థ నిర్వీర్యం అవుతోందని అన్నారు.17 సంవత్సరాలుగా ఎంఈఓ పోస్టులు భర్తీకాక క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించిందని అన్నారు. అదేవిధంగా భావి ఉపాధ్యాయులను తయారు చేసే డైట్ కళాశాలలలో గత రెండు దశాబ్దాలుగా లెక్చరర్ల పదోన్నతులు లేవన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకాలు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు జరగాలంటే వెంటనే ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని కోరారు. అదే విధంగా 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. మన ఊరు మనబడి పనుల్లో నాణ్యత ఉండేట్లు చూడాలని కోరారు. అదేవిధంగా పాఠశాలలో సర్వీస్ పర్సన్ నియమించాలని, విద్య వాలంటీలను నియమించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు చొరవ తీసుకోవాలని కోరారు అవసరమైతే సమిష్టి ఉద్యమాల ద్వారా సాధించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శ్రీకాంత్, ఎం.జలంధర్‌రెడ్డి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బేర దేవన్న, సహాధ్యక్షురాలు ఆర్.సుజాత,రాష్ట్ర నాయకులు సురేష్ వైద్య, ఆర్.రామారావు, జిల్లా నాయకులు వై.రామ్‌రెడ్డి,

గంద్రత్ నారాయణ, మధుసూదన్‌రెడ్డి, జాదవ్ బలిరాం, అంజన దేవి, అరుణ, వై.లింగారెడ్డి, ప్రఫుల్ చందర్ రెడ్డి, అర్స రమేష్, వీణ, వెంకట్రావు పాల్గొన్నారు.

'బీజేపీ నాయకుల బుద్ధి మందగిస్తోంది'

నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

బీజేపీ నాయకులకు బుద్ధి మందగిస్తోందని, దేవుళ్ల పేర్లతో రాజకీయం చేయొద్దని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. దేశ ప్రజానికానికి అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా బీ.ఆర్.ఎస్ జాతీయ పార్టీగా ఎదుగుతుందని తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో న్యూహౌసింగ్‌బోర్డు, భాగ్యనగర్ కాలనీలకు చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అనుసరిస్తున్న వైఖరిని ఎండగట్టారు.

కాంగ్రెస్ పార్టీని గడప గడపకు తీసుకెళ్లడమే లక్ష్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

కాంగ్రెస్ పార్టీని గడప గడపకు తీసుకుని పోవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ గార్డెన్ లో నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. టీపీసీసీ పిలుపు మేరకు జనవరి 26వ తేదిన చేపట్టే యాత్ర కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ సమస్యలను బూత్ స్థాయిలో గుర్తించి ప్రభుత్వం పై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ని అధికారంలోకి తీసుకు వచ్చేల కృషి చేయాలన్నారు. జనవరి 26వ తేదీ నుండి హత్ సే హత్ జోడో యాత్ర కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు.జనవరి 26వ తేదీన కాంగ్రెస్ శ్రేణులు గ్రామీణ, మండల, జిల్లా స్థాయిలో ఉదయం జాతీయ జెండా ఆవిష్కరణ చేసి, కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. అనంతరం పాదయాత్ర చేపట్టాలని సూచించారు. ప్రజలనుండి కాంగ్రెస్ పార్టీకి విశేష ఆదరణ లభిస్తోందని కార్యకర్తలు, నాయకులు వారికి మరింత చేరువ కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చారులత రాథోడ్, నాయకులు ఆడె గజేందర్, భరత్ చౌహన్, దిగంబర్‌రావు పాటిల్, భూపెల్లి శ్రీధర్, అట్ల గోవర్ధన్‌రెడ్డి, ఖడే సంతోష్, గుడిపెల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీపీయూఎస్ కృషి



ఉట్నూర్ : ఉపాధ్యాయుల సమస్యల సాధనకై టీపీయూఎస్ నిరంతరంగా కృషి చేస్తుందని ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ అన్నారు. ఆదివారం స్థానికంగా మండల కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించిన అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు వినోద్, ప్రధాన కార్యదర్శి ధర్మేందర్, గౌరవ అధ్యక్షుడు సుభాష్, ఉపాధ్యక్షుడు పృథ్వి రాజ్, మహిళ అధ్యక్షురాలు సంగీత, ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి, కార్యదర్శి ధరమ్‌సింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ ఎల్లప్పుడు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ, జిల్లా నాయకులు ఉన్నారు.

వయోవృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

వయోవృద్ధుల జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం వయో వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరాధ్య డయాగ్నొస్టిక్, ఎలైట్ హాస్పిటల్ సౌజన్యంతో 60 నుంచి 80 సంవత్సరాల వయవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ దేవిదాస్ దేశ్పాండే మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యుల చేత షుగర్ బీపీ ఇతర సాధారణ వ్యాధులకు చికిత్సలు ల్యాబ్ టెస్టులు చేయించడం జరిగిందన్నారు. శిబిరంలో సాధారణ వ్యాధులే కాకుండా వద్ధుల మోకాళ్ళ నొప్పులకు ఎముకల సంబంధిత పరీక్షలు చేయించామన్నారు. వయవృద్ధులు దైనందిన జీవితంలో క్రమం తప్పకుండా వ్యాయామం, వాకింగ్‌లను నిర్లక్ష్యం చేయకుండా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. వైద్యుల సలహాలు, సూచనల మేరకు నడుచుకోవాలన్నారు. వయవద్ధులకు పరీక్షలు చేసిన డాక్టర్ దిలీప్ రెడ్డిని వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షులు దేవిదాస్ దేశ్పాండే పెన్షనర్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ప్రజ్ఞ, డాక్టర్ రాము, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంయుక్త రెడ్డి, వయవృద్ధుల సంఘం నాయకులు శివయ్య, కిష్టయ్య ,రాజేశ్వర్, ఎన్. కిషన్, భాస్కర్, యు. భాస్కర్, ల్యాబ్ అసిస్టెంట్లు సుధీర్, సతీష్ పాల్గొన్నారు.

రవాణా రంగం కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

ఖానాపూర్ : రవాణా రంగం కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐ ఆర్ టిడబ్ల్యూఎఫ్-సిఐటియు కోశాధికారి ఎన్.శేఖర్ అన్నారు. ఆదివారం ఖానాపూర్‌లో తెలంగాణచౌక్ బస్టాండ్ వద్ద ట్రాలీ ఆటో కార్మికులు, తెలంగాణ పబ్లిక్, ప్రయివేట్ రోడ్ పోర్టు వర్కర్ పెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జీపు యాత్ర పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టం 2019లో సవరణలు చేయాలని, పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలన్నారు. పెంచిన ఓవర్ లోడ్ పెనాల్టీలు తగ్గించి.కార్మికులు కోరిన చోట పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్రంలో 'సవారి' యాప్ తరహా యాప్‌ను మన తెలంగాణ రాష్ట్రంలో తీసుకు రావాలన్నారు. ఈ సమావేశంలో ఇసాక్, విజయ్, మదుకర్,సతీష్,సబీర్, అజిత్, రమేష్ తదితరులున్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ- నేరడిగొండ

నేరడిగొండ మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన విశ్వబ్రాహ్మణులు సరస్వతి శిశు మందిర్‌లో ఆదివారం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండజీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శ్రీ రామోజీ వెంకటరమణ, కోశాధికారి సుభాష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులు సుభాష్, చంద్రశేఖర్, కుంటాల మాజీ సర్పంచ్ నారాయణ, చొక్కాపెల్లి రాములు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నేరడిగొండ

కుమారి గ్రామానికి చెందిన చెలిమెల లచ్చన్న ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలిసిన నేరడిగొండ జడ్పిటిసి అనిల్ జాదవ్ వారి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమారి మాజీ సర్పంచ్ నంది.అడేళ్ళు, మాజీ విడిసి చైర్మన్లు పో లిగంటి. ప్రవీణ్, తులసీదాస్, చంద్రశేఖర్, మాధవ్, కమలాకర్ రెడ్డి, శ్రీనివాస్, భూత రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బాలుడి ఆపరేషన్‌కు ఆర్థిక సాయం

నవతెలంగాణ- ఖానాపూర్

సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటనకు స్పందించి మంత్రి కేటీఆర్ మిత్రుడు జాన్సన్ నాయక్ ఆదివారం బాలుడి ఆపరేషన్‌కు రూ.88 వేలు ఆర్థిక సహాయం అందజేసి ఉదారత చాటుకున్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణం సుభాష్‌నగర్ కాలనీకి చెందిన కావేటి శివ- శిరీష దంపతులకు రెండో కాన్పులో మగ పిల్లాడు జన్మించాడు. కాగా గుండె సంబంధిత వ్యాధితో పుట్టడం మధ్య తరగతి కుటుంబం కావడంతో తల్లీ దండ్రులు తల్లడిల్లిపోయారు.విషయాన్ని సోషల్ మీడియాలో జాన్సన్ నాయక్ హైదరాబాద్ లోని రెయిన్బో హాస్పిటల్‌కు వెళ్లి ఆపరేషన్ నిమిత్తం రూ.88 రూపాయలు బాలుని తల్లిదండ్రులకు అందజేశాడు. ఆ దంపతులు దాతలు, ప్రజాప్రతినిధులు మా కుమారుడిని ఆదుకోవాలని సోషల్ మీడియా ద్వారా పత్రికల ద్వారా వేడుకున్నారు.

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-మంచిర్యాల



పేద కుటుంబానికి చెందిన ఒకరి వైద్య చికిత్సకు మంచిర్యాలకు చెందిన దుర్గం పోషం ట్రస్ట్ ఛైర్మెన్ దుర్గం రాజేష్ ఆదివారం రూ.14 వేలు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. చెన్నూరు ప్రాంతానికి చెందిన దుగుట వెంకటేష్ కంటి జబ్బుతో బాధపడుతున్న విషయం తెలిసి అతని శస్త్ర చికిత్స కు సంబంధించి వైద్య ఖర్చులతో పాటు మెడిసిన్ కూడా ఇప్పించి తన ఉదారత చాటుకున్నారు. ఆపదలో ఉన్న వారికి చేయూతను అందిస్తున్న దుర్గం ట్రస్టు సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో జూమ్మిడి గోపాల్, కుమ్మరి సంతోష్, కళ్యాణ్, హాస్పిటల్ సిబ్బంది సందీప్, శ్యామల పాల్గొన్నారు.

గౌడ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జన్నారం



రాష్ట్రంలో ఉన్న గౌడ కులస్తులకు గౌడ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముఖేష్ గౌడ్ అన్నారు. ఆదివారం ప్రెస్ క్లబ్ గౌడ సంఘం2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కింద పడి మతి చెందిన గౌడ కులస్తులకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు మూల భాస్కర్ గౌడ్ ప్రధాన కార్యదర్శి పొడిటి రవిగౌడ్, నాయకులు గొల్లపెల్లి రమేష్‌గౌడ్, వెంక గౌడ్, వైస్ ప్రెసిడెంట్ జగన్ గౌడ్, ముఖ్య సలహాదారులు లింగన్న గౌడ్, కోశాధికారి సతీశ్ గౌడ్, నాయకులు రమేశ్ గౌడ్, సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువత

- ఆలుగామ నుండి మండలానికి సరఫరా
- అక్రమ మార్గంలో లిక్కర్ సరఫరా
- చూసీచూడనట్లు వదిలేస్తున్న అధికారులు

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలో గంజాయి వాసన గుప్పుమంటోంది. యువత లక్ష్యంగా అధికారుల కనుసన్నల్లో మహరాష్ట్ర నుండి గంజాయి సరఫరా అవుతుంది.తెలంగాణ రాష్ట్రం నుండి లిక్కర్ మహారాష్ట్రకి సరఫరా అవుతోంది. అక్కడ దొరికే గంజాయి మన రాష్టానికి సరఫరా రావడం కలకలం రేపుతోంది. లిక్కర్ సరఫరా చేసే వ్యక్తులే గంజాయి దందానూ కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. మండలంలోని జనగామ ,ఆలుగామ గ్రామాలు మహారాష్ట్రకి సరిహద్దున ఉండటంతో ప్రాణహిత నది దాటి సరఫరా జరుగుతోంది. అధికారులకు నెలకు లక్షల్లో ముడుపులు ముట్టాజెప్పి లిక్కర్ దందాను కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.





యువతే లక్ష్యంగా

లిక్కర్ వ్యాపారులు యువతే లక్ష్యంగా అధికారులకు ముడుపులు ముట్టజెప్పి గంజాయి దందా చేస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. దీంతో కొంత మంది యువత గంజాయి వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. దీనిని ఆసరాగా తీసుకొని లిక్కర్ వ్యాపారులు యువతకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా గంజాయి సరఫరా చేస్తున్నారని ఉన్నత అధికారులకు ఎవరైనా పిర్యాదు చేసినా వారు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

పైసా ఇస్తే పర్మిషన్..?

అటు సంబంధిత అధికారులకు ముడుపులు ముట్టజెప్పితే చాలు ఇటు లిక్కర్ అటు గంజాయికి పర్మిషన్ ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మండలాన్ని గంజాయి మండలంగా మారుస్తున్నారనే విమర్శలున్నాయి. లిక్కర్ వ్యాపారం బంద్ చేపిద్దామంటే ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందనే ఉద్దేశంతోనే వారు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది.ఔ

భారీ లాభాలు ..!

గంజాయి దందాతో భారీ లాభాలు పొందవచ్చనే ఉద్దేశంతో కొందరు ఈ వ్యాపారాన్ని దర్జాగా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. రోజూ ప్రయివేటు వాహనాల్లో సరఫరా చేస్తూ అక్రమంగా సరఫరా చేస్తున్నారు. ఈ తతంగం అంతా తెలిసిన లిక్కర్ వ్యాపారుల దగ్గర నుండి నెలకు రూ.లక్షల్లో ముడుపులు అందుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఈ వ్యవహారాన్ని చూసీ చూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అ'పూర్వ'ం విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-దండేపల్లి

మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1994-1995 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 27 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరిన వారిలో ఆనందం పెల్లుబికింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో పాఠశాలలో చదివిన మరుపురాని తీపి గుర్తులు నెమరేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఎవరెవరు ఎక్కడెక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి చదువు చెప్పిన గురువులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవాన్ని పొందినప్పుడే ఉపాధ్యాయులకు పూర్తి గుర్తింపు లభిస్తుందని, విద్యార్థుల ఉన్నతిని తెలుపుతుంటే చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గురువులు చూపించిన సన్మార్గంలో నడిచి ప్రస్తుతం ప్రతి విద్యార్థి వివిధ వృత్తుల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో కొనసాగుతూ ఆనంద జీవితాన్ని గడుపుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రేమకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అనంతరం గురువులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. గురువులు చూపిన మంచి మార్గంలో పయనించడం వల్ల నేడు జీవితంలో స్థిరపడ్డామని పూర్వ విద్యార్థులు చెప్పుకొచ్చారు.

జన్నారంలో ప్రజాగోస.. బీజేపీ భరోసా..కార్యక్రమం



నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ నియోజకవర్గ బీజేపీ నాయకులు, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ చేపట్టిన ప్రజాగోస.. బీజేపీ భరోస.. ఇంటింటికి రాథోడ్ అనే కార్యక్రమాన్ని మండల కేంద్రంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కేంద్ర, ప్రభుత్వ పథకాలను, ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు తెలిపారు. ఆలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ అవినీతి పాలనను తరిమికొట్టాలనీ పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు, జిల్లా నాయకులు కొంతం శంకరయ్య, మధుసూదన్ రావు, బద్రి నాయక్, రాగుల సూర్యం పాల్గొన్నారు.

అంధత్వ రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- కంటి వెలుగుపై సమీక్షా సమావేశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రారంభంలోనే కంటి సమస్య గుర్తించి తగిన చికిత్స అందజేసి అంధత్వ రహిత రాష్ట్రమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ నెల 18 నుండి ప్రభుత్వం ప్రారంభించ తలపెట్టిన కంటి వెలుగు కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధ్యక్షతన జనకాపూర్‌లోని టాటియా గార్డెన్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్సీ దండే విటల్, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు కోనేరు కోనప్ప, అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయి, రాజేశంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1500 ప్రత్యేక టీములతో 100 రోజుల్లో రెండు కోట్ల మందికి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. రూ.250 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు వివరించారు. ఇంత పెద్ద మొత్తంలో గతంలో ఏ ప్రభుత్వం కూడా కంటి పరీక్షలు నిర్వహించలేదని తెలిపారు. గిన్నిస్ రికార్డు సృష్టించేలా కార్యక్రమాన్ని రూపొందించినట్టు వివరించారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ నెల 12 లోపు మండల, నియోజకవర్గస్థాయి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో 26 టీములు పరీక్షల కోసం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి టీం ఒక్కరోజు 300 నుంచి 400 మందికి పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతిరోజు రూ.వెయ్యి చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. ఎమ్మెల్సీ దండేవిఠల్ మాట్లాడుతూ గ్రామాల్లో కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించి వారి వివరాలను నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసే సమయంలో ప్రజాప్రతినిధులు కంటి సమస్యలు ఉన్నవారు. కదిలి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో మొదట శిబిరాల నిర్వహించేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ ఇటీవల కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రైల్వే వైద్య శిబిరాలు 1200 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారని వివరించారు. ఇంకా పరీక్షలు చేయాల్సి ఉన్నప్పటికీ సమయం మించిపోయిందన్నారు. ఇంకా 5000 మంది పరీక్షలు చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కంటి వెలుగు కంటి పరీక్షలతో పాటు శస్త్రచికిత్సలు చేస్తే కూడా పేదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు జిల్లా వైద్యాధికారి ప్రభాకర్ రెడ్డి, అదనపు వైద్యాధికారి సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

నవతెలంగాణ-2023 క్యాలెండర్‌ను ఆదివారం ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆవిష్కరించారు. క్యాతనపల్లిలోని తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ ముందుగా నూతన శుభాకాంక్షలు తెలుపుతూ సమాజంలో జరిగే ఘటనలతో సామాజిక విలువలతో కొనుసాగుతున్న పత్రిక నవతెలంగాణ దినపత్రిక అని తెలిపారు. ప్రజల మన్ననలు పొందుతూ నవతెలంగాణ పత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా గ్రంథాలయ చైర్మన్, రేణిగుంట్ల ప్రవీణ్, టీఆర్ఎస్ పార్టీ నాయకులు, రిపోర్టర్ శ్రీనివాస్, క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరక్టర్ రాజీవ్



నవతెలంగాణ-మంచిర్యాల

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మన ఊరు-మనబడి కార్యక్రమంతో పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రాజీవ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మన ఊరి-మన బడి కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయ సెక్టోరిల్ అధికారులు సబ్దర్‌అలీ ఖాన్, చౌదరి పరీక్షల కార్యదర్శి కే.భీమ్‌రావులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. అనంతరం పాఠశాల ప్రార్ధన సమయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి ఉత్తములుగా ఎదగాలని, తమ కలలను సాకారం చేసుకోవాడానికి పాఠశాల విద్యను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రతి విద్యార్థి అభ్యసన నైపుణ్యాలను కలిగి ఉండాలని ఆ దిశగా అధికారులు, ఉపాధ్యాయులు సంసిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులు వంద శాతం పాఠశాలకు హాజరై పాఠశాలలోని నిర్వహించే అన్ని రకాల కార్యక్రమాల్లో పాల్గొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని అన్నారు. భవిష్యత్తులో ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు కూడా ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి బడిలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు తెలుసు కొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు గుండేటి యోగేశ్వర్, వెంకటేశ్వర్లు, గోలి మనోహర్, నాగరాజు, సునితాదేవీ పాల్గొన్నారు.

దరఖాస్తులు పెండిగ్‌లో లేకుండా చూడాలి

- మంచిర్యాల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



నవతెలంగాణ-దండేపల్లి

ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరణిలో వచ్చిన దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించేలా చూడాలని అన్నారు. మండలంలో పెండింగ్ దరఖాస్తులు ఎక్కువగా ఉన్నందున త్వరగా పూర్తిచేసి రైతులకు మేలు జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ విజయ, ఆర్ఐ రంజిత్ కుమార్ ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని నిలిపివేయాలి



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని రహదారులు, భవనాలు శాఖ అతిథి గృహం స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పనులను సత్వరమే నిలిపివేయాలని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ డిమాండ్ చేశారు. ఆ స్థలంలో మాత శిశు కేంద్రం ఆస్పత్రి భవనాన్ని నిర్మించాలని సూచించారు. ఆదివారం ఐబి స్థలంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను ప్రేమ్ సాగర్ రావు, సురేఖ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా ప్రధాన కేంద్రంలో ప్రభుత్వ మాత శిశు కేంద్రం నిర్మించకుండా మార్కెట్ సముదాయం నిర్మించడం ఏమిటని వారు ప్రశ్నించారు. మాత శిశు కేంద్రాన్ని గోదావరి నది ఒడ్డున నిర్మించగా వర్షాకాలంలో బ్యాక్ వాటర్‌తో ఆస్పత్రిలోకి నీరు వచ్చిన సంగతి అందరికీ తెలిసిందే అన్నారు. అయినప్పటికీ ఆస్పత్రిని తిరిగి అందులోనే పున ప్రారంభించాలని ఏర్పాటు చేయడం శోచనీయమని అన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ముందు మాతా శిశు కేంద్రాన్ని నిర్మిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని సూచించారు. మొండి పట్టుదలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంను చేపట్టి తీరాలని నిర్ణయిస్తే తాము ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని హెచ్చరించారు. కార్యకర్తలతో పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయించి నిర్మాణం పనులను నిలిపివేస్తామని వారు స్పష్టం చేశారు. కాంట్రాక్టర్ కూడా పరిస్థితిని అర్థం చేసుకొని నిర్మాణం పనులు నిలిపివేయాలని లేకపోతే న్యాయస్థానం ఆశ్రయిస్తే పెట్టిన పెట్టుబడి నిలిచిపోయి బిల్లులు చెల్లింపు కూడా రాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధు తో పాటు కౌలు రైతులకు కూడా రైతుబంధు పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. అలాగే గతంలో రూ.145కే తొమ్మిది రకాల నిత్యావసర సరుకులను రేషన్ దుకాణం ద్వారా పంపిణీ చేశామని, మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇంకా నిత్యవసర సరుకులను పెంచి రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షులు తూముల నరేష్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పుదరి తిరుపతి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రావుల ఉప్పలయ్య, డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్ సంజీవ్, మజీద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కౌన్సిలర్ రామగిరి బానేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కౌన్సిలర్ సల్ల మహేష్ నాయకులు గడ్డం త్రిమూర్తి, వడ్డే రాజమౌళి, ఎంపీటీసీలు దేగబాపు, ముత్యాల శ్రీనివాస్, నస్పూర్ పట్టణ అధ్యక్షులు బందారి సుధాకర్, మండల అధ్యక్షులు అక్కల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'అభివృద్ధి పనులే బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తెస్తాయి'



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే మరోసారి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొస్తాయని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కళాశాల ఆవరణంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా సుపరిపాలన అందిస్తోంది అన్నారు. ఏ రాష్ట్రంలోని సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అందిస్తుంది బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. కళ్యాణలక్ష్మి షాదీ, ముబారక్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతు బీమా, రైతు బంధు, దళిత బంధు పథకాలను అమలు చేస్తూ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. అనంతరం వెంకటాపూర్ గ్రామంలో దళిత బంధు పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు రాజారామ్‌రెడ్డి సులువ జనార్దన్, వైస్ ఎంపీపీ వినయ్ కుమార్, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, గుర్రం గోపాల్‌రెడ్డి, బాలసాని శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడి మృతి విద్యార్థులకు తీరని లోటు

నవతెలంగాణ-నస్పూర్

విశ్వశాంతి హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సాహెబ్ హుస్సేన్ గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అతని మృతి విద్యార్థులకు తీరని లోటని పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు అన్నారు. ఆదివారం ఆయన సంతాప సభను ఏర్పాటు చేశారు. ముందుగా అతని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు తమతో పంచుకున్న ప్రేమాభిమానాలు, బోధనలు గుర్తు చేశారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ఇరికిల్ల లింగయ్య(పిఈటి), ఈట్ల సత్యనారాయణ(హిందీ ఉపాధ్యాయుడు), పూర్వ విద్యార్థులు నరిగె సురేష్, నరిగె నరేష్, క్యాతం రాజ్ కుమార్,ఉప్పు కుమార్, జక్కని రమేష్, కార్తీక్, సురేందర్ పాల్గొన్నారు.



రెడ్డి పరివార్ సంక్షేమానికి సహకరించాలి

నవతెలంగాణ-నస్పూర్



రెడ్డి పరివార్ సంక్షేమాభివృద్ధికి సహకరించాలని సహకరించుకోవాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం నస్పూర్ లోని సీతారామ కళ్యాణమండపంలో రెడ్డి పరివార్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.రెడ్డి కులస్తులు సంఘటితంగా అభివృద్ధి దిశలో పయనించాలని అన్నారు. సంఘం అభివృద్ధి చెందాలంటే ఏ స్థాయిలో ఉన్న సహకరించుకోవాలని సూచించారు. నస్పూర్ మండల సంఘం ఇతర మండలాలకు ఆదర్శంగా ఉండేలా ముందుకు సాగాలన్నారు. కులస్తుల్లో ఎంతోమంది పేద వారు ఉన్నారని, అందరూ కలిసి అలాంటి వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కార్యాలయ భవన నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రెడ్డి పరివార్ సంక్షేమ సంఘం 2023 క్యాలెండర్‌ను అతిధులు ఆవిష్కరించారు. అనంతరం కొత్తగా ఎన్నికైన కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా అన్నామండ్ల వెంకటరెడ్డి, అధ్యక్షుడిగా గొట్టం తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మోతె రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులుగా దూదిపాల విజయపాల్ రెడ్డి, కేడిక ప్రకాష్ రెడ్డి, కొమ్మిడి మల్లారెడ్డి, కోశాధికారిగా సంతపురి తిరుపతిరెడ్డి, ప్రెస్ అండ్ మీడియా బాధ్యులుగా కేసిరెడ్డి నారాయణరెడ్డి, కొన్ని బుచ్చిరెడ్డి, కాంతల జితేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షుడు మంద మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్ రెడ్డి, బీజేపీ నాయకుడు ముల్కల మల్లారెడ్డి, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు ఉరగొండ మధుసూదన్ రెడ్డి, టీఎస్ ఎన్పీడీసీఎల్ యూనియన్ అధ్యక్షుడు బొమ్మ సత్తిరెడ్డి, మంచిర్యాల కౌన్సిలర్ హనుమంతరెడ్డి, సత్యపాల్‌రెడ్డి, గొట్టం తిరుపతిరెడ్డి, అన్నామండ్ల వెంకటరెడ్డి కేతిరి అమర్నాథ్‌రెడ్డి, దూదిపాల విజయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏండ్ల నాటి కల నెరవేరింది

నవతెలంగాణ-సిరికొండ

మంచినీటి సమస్యతో సతమత మవుతున్న సిరికొండ వాసుల ఏండ్ల నాటి కల నెరవేరినట్ట యిందని సర్పంచ్ యెన్నం రాజారెడ్డి అన్నారు. ఆదివారం మంచినీటి పైప్‌లైన్ పనులను ప్రారంభిం మాట్లాడారు. గ్రామంలో తాగునీరు సమస్య అధికంగా ఉందని రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చెర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లగా ప్రజల ఆకాంక్ష మేరకు మంచినీటి పైప్ లైన్ మంజూరు చేసినట్టు తెలిపారు. తమ గోడు విని తాగు నీటి వసతి కోసం నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, వార్డుసభ్యులు ముషీర్, రామస్వామి, గౌస్ బాషా, రాములు, ఎంపిటిసి కిషన్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 09 జనవరి 2023

సీపీఐ గ్రామ కమిటీల ఎన్నిక

నవతెలంగాణ - రెబ్బెన

సీపీఐ తుంగెడ, మాదవాయిగూడ, నంబాల గ్రామ కమిటీలను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ఆ పార్టీ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, జిల్లా కార్యవర్గసభ్యులు బోగె ఉపేందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుంగెడ గ్రామ కార్యదర్శిగా డోంగ్రి రాజు, మాదవాయిగూడ గ్రామ కార్యదర్శిగా బీమన్‌కార్ కుమార్, సహాయ కార్యదర్శిగా చల్లూరి రాజన్న, నంబాల కార్యదర్శిగా పర్వతి సాయి ఎన్నికయ్యారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాడుతున్న పార్టీ సీపీఐ అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రైతుబంధు ఇవ్వాలని, నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా గొప్పతనంపై కలెక్టర్ రాహుల్‌రాజ్ పాట రచన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా గొప్పతనంపై కలెక్టర్ రాహుల్ రాజ్ రాసిన పాటను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, జిల్లాలోని ప్రముఖ ప్రాంతాల అభివృద్ధి వివరాలు తెలియజేస్తూ పాట కొనసాగుతుందన్నారు. పాటను జిల్లా పౌర సంబంధాల విభాగం, జిల్లా పర్యాటక విభాగం, జిల్లా సాంస్కృతిక సారధి కళాకారుల బృందంతో తెలంగాణకు చెందిన ప్రముఖ కళాకారులు సంగీతం సమకూర్చారు. జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలలో పాట చిత్రీకరించడం జరిగిందని తెలిపారు.

మెరుగైన వైద్యమందించడమే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-బేల

ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న సబ్‌సెంటర్ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అదేవిధంగా రూ.5లక్షల వ్యయంతో నిర్మించనున్న బుద్ధ విహార్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. అవసరమైన ప్రాంతాల్లో సబ్ సెంటర్లను నిర్మించి మెరుగైన వైద్య చికిత్సలు అందేలా చూస్తున్నామని పేర్కొన్నారు. ఆరోగ్యపరంగా ప్రజలు ఇబ్బందులకు గురికావొద్దన్న ఉద్దేశంతో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. గతంలో డాక్టర్ల కొరతతో జనాలు ఇక్కట్లు పడ్డ విషయాన్ని గుర్తు చేసిన ఆయన ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవని స్పష్టం చేశారు. త్వరలోనే రెండవ విడత కంటి వెలుగును ప్రారంభించనున్న నేపథ్యంలో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రావుత్ మనోహర్, సర్పంచ్ ఇంద్రశేఖర్, డిఎంఅండ్‌హెచ్‌ఓ నరేందర్ రాథోడ్, పిహెచ్‌సి వైద్యులు వంశీకృష్ణ, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, నాయకులు గంభీర్ ఠాక్రే, దేవన్న, సతీష్ పవార్, తేజ్‌రావ్ మస్కే, మంగేశ్ ఠాక్రే, సుధాకర్, సంతోష్ భేదొడ్కర్, ఎజాజ్ పాల్గొన్నారు.

కుంటలమానెపెల్లిలో వాలీబాల్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ - బెజ్జూర్

మండలంలోని కుంటలమానెపెల్లి గ్రామంలో స్ఫూర్తి యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో స్ఫూర్తి యువత ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ క్రీడల్లో మండలంలోని 30 వాలీబాల్, 20 కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్, మండల కోఆప్షన్ సభ్యుడు బశరత్‌ఖాన్, కుంటలమానెపెల్లి ఉప సర్పంచ్ మోహన్, బీఆర్ఎస్ అధ్యక్షుడు సకారాం, ఆదివాసీ మండల ప్రధాన కార్యదర్శి కొర్తె తిరుపతి, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సాకెర గ్రామానికి చెందిన సర్పంచ్ మీరాబాయి మనమడు దరావత్ ప్రశాంత్‌కు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. పిప్పల్‌దరి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ముత్యంరెడ్డి అన్న అనారోగ్యంతో ఉండడంతో జడ్పిటిసి అనిల్ జాదవ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచులు దారవత్ మీరాబాయి, బండారి శ్రీధర్‌రెడ్డి, ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, సంతోష్, దేవేందర్‌రెడ్డి ఉన్నారు.

అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ జిల్లా కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ జిల్లా కమిటీని జిల్లా కేంద్రంలో జాతీయ కన్వీనర్ పాండురంగ సర్వార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా సుదర్శన్ ఎంపిక కాగా ప్రధాన కార్యదర్శిగా యాదవరావు, ఉపాధ్యక్షులుగా దశవంతరావు, సెక్రెటరీగా మహేష్, జాయింట్ సెక్రెటరీగా కృష్ణ, ముఖ్య సలహాదారునిగా రాంషా, జిల్లా కమిటీ సభ్యులుగా వెంకన్న, అన్నపూర్ణ, శైలజ ఎన్నికైనట్లు తెలిపారు.

స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఎస్బీఐ అర్సెట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ శిక్షకులు డి.ఆశన్న తెలిపారు. ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. మహిళల కోసం టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, పురుషులకు హౌజ్ వైరింగ్, బైక్ మెకానిక్, సెల్ ఫోన్‌ల రిపేరింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులు 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన దరఖాస్తులకు అర్హులన్నారు. శిక్షణ సమయములో ఉచిత భోజన వసతి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31లోపు దరఖాస్తులను కేబీ కాంప్లెక్స్‌లోని శిక్షణ కేంద్రంలో అందజేయాలని పేర్కొన్నారు.

'కంటి వెలుగు'తో కంటి సమస్యలు దూరం

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ- మంచిర్యాల

ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల కంటి సమస్యలు దూరం చేసేందుకు కృషి చేస్తోందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతికత, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల సమావేశ మందిరంలో ఈ నెల 18న ప్రారంభం కానున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం సన్నాహక ఏర్పాట్లపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్, కలెక్టర్ భారతి హోళికేరి, జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) బి.రాహుల్, జిల్లా పరిషత్ చైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మీ, శాసన మండలి సభ్యులు దండె విఠల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 18 నుండి 100 రోజుల పాటు రెండవ విడత కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నామని తెలిపారు. ఈ నెల 12 లోగా మండల పరిషత్, మున్సిపాలిటీలలో సమావేశాలు పూర్తి చేయాలని, శిబిరాలపై క్షేత్ర స్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అందుబాటులో శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, కంటి అద్దాలు అందిస్తామని పేర్కొన్నారు. పరీక్షలు చేయడంతో పాటు శస్త్రచికిత్స అవసరం ఉన్న వారికి ఒక తేదీని నిర్ణయించి చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చి జీవించే వారికి కూడా అవకాశం కల్పించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్, ఎంపిటిసిలు వారి పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో ప్రభుత్వ ఆసుపత్రులు పని చేస్తున్నాయని, ఈ మేరకు కంటి వెలుగు శిబిరాల నిర్వహణ కొరకు రాష్ట్ర వ్యాప్తంగా 950 వైద్యులను నియమించగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు 255 మంది వైద్యులను భర్తీ చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే సుమన్ మాట్లాడుతూ రాష్ట్రంలో చిన్నపిల్లల నుండి పెద్దవారి వరకు ఎలాంటి కంటి సమస్యలు లేకుండా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి రూపకల్పన చేసిందని తెలిపారు. మొదటి విడత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈ సారి 100 రోజుల్లోనే పూర్తిస్థాయిలో కంటి పరీక్షలు నిర్వహించే విధంగా కార్యాచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు. కలెక్టర్ భారతిహోళికేరి మాట్లాడుతూ రెండవ విడత కార్యక్రమంలో లక్ష్యాలను అధిగమించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో కృషి చేయాలని, జిల్లాలో వంద శాతం కార్యక్రమం విజయవంతం చేసేందుకు 40 వైద్య బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, రెండు అదనపు బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలోని వార్డులు, అన్ని గ్రామాలలో 484 కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ సెలవులతో కూడిన 100 రోజుల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇందు కొరకు 40 పారామెడికల్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, సహాయకులు ఇతరత్రా వైద్య సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జిసి.సుబ్బారాయుడు, డిసిఎంఎస్ చైర్మన్ లింగయ్య, మంచిర్యాల, లక్షెట్టిపేట, నస్పూర్ మున్సిపాలిటీల చైర్మన్లు పెంట రాజయ్య, నల్మాసు కాంతయ్య ప్రభాకర్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, క్యాతన్‌పల్లి, చెన్నూర్, బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్లు, గ్రంథాలయ చైర్మన్ ప్రవీణ్, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, వైద్యాధికారులు, మండల విద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ ఆత్మగౌరవ దినోత్సవం



నవతెలంగాణ - దహెగాం

మండలంలోని బీబ్రా గ్రామంలో ఆదివాసీ ఆత్మగౌరవ దినోత్సవాన్ని ఆదివాసులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా భీమదేవర జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామం నుండి భీమన్న దేవాలయం వద్దకు ఊరేగింపుగా తరలివెళ్లారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివాసీ మన్నెవార్ యువజన సంఘం మండలాధ్యక్షుడు కొడిపె నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఆదివాసులు ఏకమై తమ హక్కులను సాధించుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికలప్పుడు కేవలం ఆదివాసులను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారన్నారు. ఆదివాసులందరు విద్య, ఉద్యోగం, రాజకీయంలోనూ రాణించాలన్నారు. ప్రభుత్వం నుండి తమ హక్కులను సాధించుకోవడానికి అందరు కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ మన్నెవార్ సంఘం నాయకులు అల్లకొండ లక్ష్మణ్, శ్రీకాంత్, శేఖర్, బొంతయ్య, పెంటయ్య, శ్రీనివాస్, శంకర్, పోశం, భీమయ్య పాల్గొన్నారు.

కౌటాల : ఆదివాసీ గిరిజన మన్నెవార్ల ఆరాధ్య దైవం భీమదేవర జెండా పండుగను ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గిరిజన సాంప్రదాయం ప్రకారం జరుపుకున్నారు. మండల కేంద్రంలో కౌటాల గ్రామాధ్యక్షుడు ఎడ్ల భీమయ్య జెండాను ఆవిష్కరించగా, గ్రామ జెండాను డబ్బ బాపు ఆవిష్కరించారు. మన్నెవార్ల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మెర్పెల్లి బ్రహ్మయ్య, గురుడుపేట గ్రామంలో సాంప్రదాయ బద్ధంగా ఊరేగింపుగా వచ్చి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ మన్నెవార్లు ఐక్యంగా ఉండాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఆదివాసీ గిరిజనులకు అందే అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-జన్నారం

అతివేగంతో బండరాయిని ఢీకొట్టడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం..ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి సిరికొండకు వెళ్తున్న కారు అతివేగంగా పైడిపెల్లి గ్రామ సమీపంలో బండరాయిని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇచ్చోడ మండలం సిరికొండ గ్రామానికి చెందిన ఓరుగంటి వెంకటేష్, పస ప్రవీణ్, వందన అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై సతీష్ సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ఇందులో వందన అశోక్ పరిస్థితి విషమంగా ఉందని ఎస్సై వివరించారు. అతివేగంగా బండరాయిని ఢీకొట్టడంతోనే ప్రమాదం సంభవించినట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



నవతెలంగాణ- కాసిపేట

తహసీల్దార్ కార్యాలయాన్ని ఆదివారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు. ధరణి రికార్డులను పరిశీలించారు. సంబంధిత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను విచారించి వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎంఆర్ఐ సులోచన పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో భోజన నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ దిలీప్‌కుమార్ ఉన్నారు.

దొంగతనానికి యత్నించిన వ్యక్తి రిమాండ్

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

మండలంలోని సుర్జాపూర్ గ్రామ వెంకటేశ్వర ఆలయంలో శనివారం దొంగతనానికి యత్నించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ అజయ్ బాబు, ఎస్ఐ శంకర్ తెలిపారు. ఆలయంలోని హుండీని నిందితుడు కర్రతో కొట్టి పగులగొట్టేందుకు యత్నించినట్లు వివరించారు.

త్వరలో రేణుకా ఎల్లమ్మగుడి ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ఈజ్ గాం రోడ్డులో నూతనంగా నిర్మించిన రేణుకామాత ఎల్లమ్మ గుడిని త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గౌడ సంఘం నాయకులు తెలిపారు. పట్టణంలోని తెల్లకల్లు డిపోలో ఆదివారం గౌడ సంఘం సమావేశం నిర్వహించారు. కోటగిరి రాంచందర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పలు అంశాలు చర్చించి తీర్మానం చేశారు. ఆలయ నిర్మాణం పూర్తికావచ్చిందని, విగ్రహ ప్రతిష్టాపనకు ఏర్పాట్లు చేసి ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తామన్నారు. గుడి నిర్మాణానికి, స్థలం కోసం సంహరించిన ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు, సభ్యులకు ధన్యవాదములు తెలిపారు. అంతకుముందు ఇటీవల మరణించిన పలువురు సభ్యులు నాగభూషణం గౌడ్, సత్య గౌడ్, సాగర్ గౌడ్, నారాయణ గౌడ్‌లకు నివాళ్ళు అర్పించారు. సమావేశంలో సంఘం పెద్దలు రాములు గౌడ్, ప్రకాష్ గౌడ్, ఎల్లాగౌడ్, లక్ష్మినారాయణగౌడ్, ప్రకాష్‌గౌడ్, వెంకటేశ్వర్‌గౌడ్, రమేష్ గౌడ్, దిలీప్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, దిండు దేవి గౌడ్, నగేష్ గౌడ్, కృష్ణ మోహన్‌గౌడ్, సునిల్ గౌడ్, ఆదినారాయణ గౌడ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్ రద్దు చేసే వరకూ పోరు

- భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించిన ఐక్య కార్యాచరణ కమిటీ
- నేడు కౌన్సెలర్‌లకు వినతి.. 11న మున్సిపల్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-సదాశివనగర్

మాస్టర్ ప్లాన్ రద్దు చేసే వరకూ పోరుబాటలో ఉంటామని రైతులు స్పష్టం చేశారు. ఆదివారం కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డిలో రైతుల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో రైతుల అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మీడియా సమావేశాలపై రైతులు చర్చించారు. ప్రభుత్వం నుండి సరైన సమాధానం వచ్చే వరకు పోరాటాన్ని ఆపేది లేదని రైతుల నిర్ణయించుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో భూములు కోల్పోవడానికి వీలులేదని నేడు (సోమవారం) ప్రతి కౌన్సిలర్ ఇంటికి పోయి వినతిపత్రం ఇవ్వాలని తీర్మానం చేశారు. అదేవిధంగా ఈ నెల 11వ తేదీన అభ్యంతరాలకు ఆఖరి తేదీ రోజు కాబట్టి అదే రోజు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టడానికి తీర్మానం చేశారు. అప్పటికి కూడా ప్రభుత్వం నుండి స్పష్టత రాకపోతే తర్వాత రైతుల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యాచరణను తెలుపుతామని అన్నారు.

సదరమట్ ప్రాజెక్టుకు నీటి విడుదల

నవతెలంగాణ-మెండోరా

శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి సదర్‌మట్ ప్రాజెక్టు ఆయకట్టుకు ఆదివారం నీటిని విడుదల చేసినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం చక్రపాణి తెలిపారు. కావున గోదావరి నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేపలు పట్టేవారు, పశువుల కాపరులు, రైతులు, ఇతరులు గోదావరి నదిలోకి వెళ్లకూడదని హెచ్చరిక జారీ చేశారు. గోదావరి వరద గేట్ల నుంచి తొలుత వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా.. క్రమంగా 500 క్యూసెక్కులకు పెంచనున్నట్టు తెలిపారు.

నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం

ఉత్తర తెలంగాణ వర ప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం నిలకడగా ఉంది. ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు(90.3 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1087.7 అడుగుల(75.465 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే రోజు 1089.4 అడుగుల (81.69 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. కాలువలకు, ఎత్తిపోతల పథకాలకు, మిషన్ భగీరథకు కలిపి రోజుకు సగటు సుమారు 8000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నేడు విద్యుత్‌సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా నేడు(సోమవారం) పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొననున్నట్టు డీఈ సాలియ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణంలోని కాకతీయ నగర్ సబ్‌స్టేషన్, హౌసింగ్ బోర్డ్ సబ్ స్టేషన్ పరిధిలో గల కాలనీలైన హౌసింగ్ బోర్డ్ కాలనీ, దేవునిపల్లీ, విద్యానగర్, కాకతీయ నగర్‌తో పాటు నరసన్నపల్లి, రాజంపేట్, చిన్నమల్లారెడ్డి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొనున్నట్టు తెలిపారు. పై సబ్ స్టేషన్‌లలోని రైతు లకు ఉదయం 3 గంటల నుండి 3 ఫేస్ సప్లయ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాలేజీ స్థలాన్ని కాపాడాలి

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భూములను కాపాడాలని పూర్వ విద్యార్థులు కోరారు. ఇటీవల ఆక్రమణకు గురై పలువురు గుడిసెలు వేసుకోగా.. ఆదివారం వారితో మాట్లాడి కాలేజీ స్థలం నుంచి తొలగించుకోవాలని సూచించారు. ఇదే విషయమై తహసీల్దార్, డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ప్రభుత్వ కాలేజీకి మొత్తం ఐదెకరాల భూమి ఉందని, సర్వే చేపట్టి హద్దులు పాతి స్థలాన్ని ఆక్రమణలకు గురికాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన న్యాయవాది నారాయణ, చిలుక శ్రీనివాస్, వార్డు మెంబర్లు రాజారాం రమేష్, నరేశ్ ,లక్ష్మణ్ ,శరత్ పలువురు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రానికి చెందిన హీనా బేగంకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 60 వేల రూపాయల చెక్కును ఆమె భర్త మహమ్మద్ హజీకి జడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితురాలు ఇటీవలి కాలంలో అనారోగ్యానికి గురికావడంతో వైద్య నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోవడంతో మంజూరైన చెక్కును అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసవి రమేష్ , ఉప సర్పంచ్ ఇబ్రహీం , మాజీ కో ఆప్షన్ మెంబర్ షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.